క్లుప్తంగా

కొలువుదీరిన పీర్లు



ముసలిమడుగు పీర్లచావిడిలో కొలువుదీరిన పీర్లు

కొత్తపల్లి: మండలంలోని ముసలిమడుగు గ్రామంలోని పీర్లచావిడిలో పీర్లు కొలువు దీరాయి. గ్రామ పెద్దలు శనివారం తెల్లవారు జామున పీర్లపెట్టెను గ్రామంలోని పురవీధుల వెంట ఊరేగించిన అనంతరం పీర్ల చావిడిలో పీర్లను కొలువు దీర్చారు. గ్రామంలో పీర్లపండుగను శతాబ్దాల కాలం నుంచి కుల, మతాలకు అతీతంగా జరుపుకోవడం ఆనవాయితీ. కొలువుదీరిన పీర్లకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆదివారం చిన్న సరిగెత్తు, సోమవారం ప్రత్యేక పూజలు, పగలు సరిగెత్తు, మంగళవారం పెద్దసరిగెత్తు, బుధవారం పీర్లను ఏటీకి సాగనంపే కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి

ఆత్మకూరు: పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో బాలికపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహ నాయక్, కేవీపీఎస్ నాయకుడు పాతకోట భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.నాయకులు ఎస్.స్వాములు, రామ్‌నాయక్, మల్లయ్య, వలీ, మోహన్, సామేలు, కాశీ, రవి, రాజు, విజయ్ పాల్గొన్నారు.

తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు: తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణంలోని బజార్ శాఖ పోస్టు మాస్టర్ ఖాజామొహిద్దీన్ కోరారు. శనివారం పట్టణంలోని తపాలా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అని ఇన్సూరెన్స్ కంపెనీల కంటే తపాలా జీవిత బీమా ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

గుండమ్మను హత్య చేసిన వారిని శిక్షించాలి

ఆత్మకూరు: ఆదోని మండలం నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన అధికార పార్టీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నాగరాజు, లక్ష్మన్న, సోమప్పను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి.భాస్కర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుదర్శనవర్మ స్మారక భవనంలో విలేకరులతో మాట్లాడారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు నరసింహనాయక్, బేగరీల సంఘం మండల నాయకుడు ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహానందిలో నేడు 'ఆలయశుద్ధి'

మహానంది: ఆలయంలో ఆదివారం ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందిన సేవకులు సుమారు రెండు వందల మంది పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు ముందుగా గణపతిపూజ, పుణ్యాహవాచనం అనంతరం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, మూలికలు, గంధ, చందనాలతో శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర, కోదండరామాలయాల గర్భాలయాలతో పాటు మండపాలు, గోపురాలు, ఆలయ ప్రాకారాలను శాస్త్రోక్తంగా శుద్ధి చేయనున్నట్లు చెప్పారు.

చిరుతను త్వరలో బంధిస్తాం



అటవీ, దేవదాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్ నాయక్

మహానంది: మహానంది, పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుతను త్వరలోనే బంధించి సుదూర ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని వైల్డ్‌లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ వార్డెన్ అజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. మహానందిలోని గోశాల, ఈశ్వర్‌నగర్ ప్రాంతాల్లో చిరుత సంచరించిన పరిసరాలను శనివారం ఆయన అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అనురాగ్ మీనా, ఆలయ ఏఈఓ ఓంకారం వేంకటేశ్వరుడు, అటవీశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులు, స్థానికులకు చిరుత నుంచి ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు, నాలుగు రోజుల్లో ఆపరేషన్‌ను పూర్తి చేస్తామని, అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సహకరించాలన్నారు. ఎఫ్ఆర్‌ఓ దినేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌ఓ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్‌కుమార్, తదితరులతో తాజా పరిణామాలపై వారితో చర్చించారు.

మొక్కజొన్న సాగుకే మొగ్గు

- మే నెలలోనే మొదలైన పంట సాగు
- ముందస్తు వర్షాలతో రైతుల్లో ఆశలు
- తక్కువ పెట్టుబడి, ధర లభిస్తుండటంతో విస్తారంగా సాగు
- ఈనెల 15వ తేదీ వరకు సాగుకు అనుకూలం



కురుకుంద వద్ద కళకళలాడుతున్న మొక్కజొన్న పైరు



కురుకుంద సమీపంలో ట్రాక్టర్‌తో మందు వేస్తున్న రైతులు

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో ఈ ఏడాది మొక్కజొన్న పంటను రైతులు అత్యధికంగా సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో వాణిజ్య పంటలైన మొక్కజొన్నతో పాటు పత్తి పంటను సాగుచేసినప్పటికీ అత్యధికంగా మొక్కజొన్న వైపే మొగ్గు చూపారు. ప్రస్తుతం పంట ఏపుగా పెరిగింది. ఆత్మకూరు మండలంతో పాటు వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో కూడా విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పైరు పచ్చగా కళకళలాడుతోంది.

మే మొదటివారం నుంచే సాగు..

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు కురవడంతో రైతులు వెంటనే విత్తనాలు వేశారు. వాస్తవానికి జూన్ 15వ తేదీ నుంచి జూలై 15వ తేదీ వరకు ఖరీఫ్ సీజన్‌గా అధికారులు పేర్కొంటారు. అయితే ఏప్రిల్ చివరి వారం నుంచి ఆత్మకూరు డివిజన్‌లో విస్తారంగా వర్షాలు కురవడంతో అన్నదాతలు పంటు సాగుకు పూనుకున్నారు.డివిజన్ పరిధిలో మే నెలలో 29 మి.మీ., సాధారణ వర్షపాతం కురవాల్సి ఉండగా 139.76 మి.మీ., జూన్‌లో 92 మి.మీ.కు గానూ 250.2 మి.మీ., ఈ నెలలో 167 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటికే 108.6 మి.మీ. కురిసింది.

పెరిగిన సాగు..

ఈ ఏడాది డివిజన్‌లో మొక్కజొన్న పంట అధికంగా సాగైంది. ఆత్మకూరు మండలంలో సాధారణంగా మొక్కజొన్న పంట 4,792 హెక్టార్లకు గానూ ఇప్పటికే 6,184 హెక్టార్లలో ఈ పంటను సాగుచేశారు. గతేడాది 4,200 హెక్టార్లలో మాత్రమే వేశారు. వెలుగోడు మండలంలో సాధారణంగా 1,069 హెక్టార్లలో మొక్కజొన్న పంటను సాగుచేయాల్సి ఉండగా ఇప్పటికే 1,200 హెక్టార్లలో సాగుచేశారు. గతేడాది కేవలం 900 హెక్టార్లకే పరిమితమైంది. పాములపాడు మండలంలో రికార్డుస్థాయిలో 6,422 హెక్టార్లలో ఈ పంటను సాగుచేస్తారు. అయితే ఇప్పటికే 8 వేల హెక్టార్లకు పైగా సాగుచేశారని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే కొత్తపల్లి మండలంలో సాధారణంగా 4,500 హెక్టార్లలో సాగుచేయాల్సి ఉండగా ఇప్పటికే రైతులు 5 వేల హెక్టార్లలో పంట సాగైంది. గతేడాదితో పోలిస్తే అధికంగా సాగు చేశారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఆకట్టుకుంటున్న గిట్టుబాటు ధర..

మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర ఉండడంతో వేలాది ఎకరాల్లో పంటను సాగుచేశారు. గత ప్రభుత్వం మొక్కజొన్న పంటకు రూ.1976 మద్దతు ధరను ప్రకటించింది. కాగా ప్రస్తుతం క్వింటా రూ.2 వేల నుంచి రూ.2200 వరకు పలుకుతోంది. దీంతో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడినిస్తుందని సాగుకు మొగ్గు చూపారు. పంట బాగా పండితే ఎకరాకు 40 క్వింటాళ్ల నుంచి 50 క్వింటాళ్ల వరకు వస్తుంది.

తక్కువ పెట్టుబడి



మొక్కజొన్న పంట ఆత్మకూరు మండలంలో విస్తారంగా రైతులు సాగు చేశారు. తక్కువ పెట్టుబడి పెట్టినప్పటికీ అధికంగా పండుతుందని, గిట్టుబాటు ధర వల్ల రైతులకు ఊరటనిస్తుంది. దీంతో మొక్కజొన్న పంటను సాగుచేసేందుకు ఇష్టపడుతున్నారు.

– వెంకటేశ్వర్లు, రైతు, ఆత్మకూరు

రెండు ఎకరాల్లో సాగుచేశా



నేను రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ప్రస్తుతం పంట ఏపుగా పెరుగుతుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు ఊరటనిస్తున్నాయి. పంట బాగా వస్తే ఎకరాకు 30 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల దాకా దిగుబడి లభిస్తుంది. సకాలంలో వర్షాలు కురిస్తే రైతులకు మంచి లాభాలను తెచ్చిపెడుతుంది.

– హనుమంతరెడ్డి, రైతు, ఆత్మకూరు

ఈనెల 15వ తేదీ వరకు సాగుచేయొచ్చు



ఖరీఫ్ సాగులో భాగంగా ఈనెల 15వ తేదీ వరకు పంటలను సాగు చేసేందుకు సమయం ఉంది. మొక్కజొన్నతో పాటు కంది పంటలకు వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. ఖరీఫ్‌కు సమయం ఉన్నందున పంటల సాగు పెరిగే అవకాశముంది.

– విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

వీధి దీపాల ఏర్పాటు



ఈశ్వర్‌నగర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీలో శనివారం వీధి దీపాలు ఏర్పాటు చేశారు. చిరుత సంచరిస్తుందనే సమాచారం మేరకు జేసీ రాహుల్ కుమార్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సమయంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా సానుకూలంగా స్పందించారు. అలాగే అక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పలను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని ఆదేశించడంతో అధికారులు చిరుత సంచరించిన ప్రాంతాల్లోని కంపచెట్లు, చెత్తకుప్పలను తొలగించారు. అధికారులు మాట్లాడుతూ చిరుత సంచరిస్తున్న నేపథ్యంలో చీకటి పడే వరకు రైతులు పొలాల్లో ఉండరాదని సూచించారు. కాలనీ ప్రజలు సైతం అత్యవసరమైతేనే బయటికి రావాలని కోరారు. వీఆర్‌ఓ శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

జగజ్జననీ నమోస్తుతే

నంద్యాల(వ్యవసాయం): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని జగజ్జననీ ఆలయంలో శనివారం మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి చీర, సారె సమర్పించారు. జగజ్జననీ అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు, ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చన, రాహుకాల పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి ప్రతిమకు గ్రామోత్సవం నిర్వహించారు.

విస్తారంగా వర్షం



ఆత్మకూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలో వర్షం విస్తారంగా కురుస్తోంది. శుక్రవారం ప్రారంభమైన వాన శనివారం సాయంత్రం వరకు విడతలు విడతలుగా కురవడంతో ఇటీవల మొక్కజొన్న సాగుచేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో శనివారం వేకువజామున 9.8 మి.మీ. వర్షం కురిసింది. కాగా మే, జూన్ నెలలో వేసిన మొక్కజొన్న పంటకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపతుందని రైతులు పేర్కొంటున్నారు. వారం రోజులుగా వర్షం కురవకపోవడంతో రైతులు మొక్కజొన్న పంట సాగుచేశారు.

20.4 మి.మీల వర్షపాతం

కొత్తపల్లి: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు జోరుగా వర్షం కురుస్తుంది. మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, సింగరాజుపల్లె, లింగాపురం, గోకవరం, ఎదురుపాడు కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, గువ్వలకుంట్ల గ్రామాలతో పాటుగా కొత్తపల్లి మండల కేంద్రంలో మోస్తరు వర్షం కురిసింది. సుమారు 20.4 మి.మీల వర్షపాతం నమోదు అయిందని ఏఎస్‌ఓ రాజ్‌పాల్ తెలిపారు. దీంతో రైతులు సాగుచేసుకుంటున్న వరిపొలాల్లో వర్షపు నీరు చేరింది. మొలకెత్తుతున్న వరి పైర్లు ఈ వర్షానికి పచ్చగా కనువిందు చేస్తున్నాయి.

మహానంది: ఆవర్తన ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి మహానంది మండలంలో రెండు గంటల పాటు మోస్తరు వర్షం కురిసింది. కొద్దిరోజులుగా మేఘాలు కమ్ముకుంటున్నా చినుకు రాలకపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. ఇప్పటికే పసుపు, మొక్కజొన్న, పొగాకు తదితర పంటల సాగు మొదలుపెట్టారు. ఎట్టకేలకు మోస్తరు వర్షం కురవడంతో రైతుల మోముల్లో సంతోషం విరబూసింది.



పాలెంచెరువు గూడెం సమీపంలో వరిపొలం నిలిచిన వర్షపు నీరు



గాజులపల్లెలో వర్షం కురుస్తున్న దృశ్యం

వాన దేవా కరుణించు



వానదేవా కరుణించు అంటూ పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: వాన దేవా కరుణించి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే జయసూర్య ప్రార్థించారు. శనివారం మండల పరిధిలోని స్వగ్రామమైన అల్లూరులో వర్షాలు కురవాలని కోరుతూ గ్రామ రైతులు చేస్తున్న వరుణయాగంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. వానదేవా కరుణించి రైతులు వేసిన పంటలను కాపాడాలంటూ రైతులు, భక్తులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, రైతులు, తదితరులు ఉన్నారు.

ఊరించి ఉసూరుమనిపించిన వాన

పాములపాడు: రెండు రోజుల నుంచి ఆకాశంలో మేఘాలు మేఘావృతమయ్యాయి. కారు మబ్బులు కమ్ముకున్నాయి. ఇది చూసిన రైతన్నలు వర్షం పడుతుందని ఎంతగానో ఆశపడ్డారు. అయితే ఆకాశంలో కమ్ముకున్న మేఘాలు ఊరించి ఉసూరుమనిపిచ్చినట్లు అయ్యింది. శుక్రవారం రాత్రి కురిసిన వాన అంతంత మాత్రమే. శనివారం మధ్యాహ్నం వచ్చిందిలే వర్షం ఇక భారీగా కురుస్తుందని అంతా భావించారు. అయితే అలా వచ్చి ఇలా ఆగిపోవడం రైతులను కలవర పెట్టింది. ప్రతి రోజూ ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటున్నప్పటికీ వరుణుడు కరుణించకపోవడంతో రైతన్నలు సాగు చేస్తున్న పైర్లు చేతికందేనా అని ఆలోచనలో పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం సమీపంలో శనివారం కారు,బైకు ఢీ కొనడంతో బైక్‌పైనున్న సున్నిపెంటకు చెందిన శ్రీను గాయపడ్డాడు. ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.సెలవు రోజులు కావడంతో భక్తులు తరలిరావడంతో వాహనాల సంఖ్య పెరిగిపోయి డ్యాం ఘాట్‌లో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న సున్నిపెంట టూటౌన్ సీఐ రమేష్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్ది గాయపడిన శ్రీనును సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వాహనాలను క్రమబద్ధీకరించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

పచ్చగడ్డితో పశువులకు రోగనిరోధక శక్తి

మహానంది: దాణా కంటే పచ్చగడ్డిని పశువులకు మేతగా అందిస్తే వాటిల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని బండిఆత్మకూరు మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనూష తెలిపారు. శనివారం సంతజూటూరు గ్రామంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ నాణ్యమైన పశుగ్రాసంతో పాడిపశువుల్లో పాల ఉత్పత్తి పెరుగుతుందని చెప్పారు. పాడి రైతులకు పశు పోషణ, జాగ్రత్తలపై అవగాహన ఎంతో ముఖ్యమన్నారు. పాడిరైతులు తమకు ఉన్న పొలంలో కొద్ది విస్తీర్ణంలో పశుగ్రాసం సాగుకు మొగ్గు చూపాలని కోరారు.



80బన్నూరు సమీపంలో పత్తి విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

పొలం పనుల్లో రైతన్నలు బిజీ

జూపాడుబంగ్లా: ఖరీఫ్ ప్రారంభం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఇప్పటివరకు కేవలం 30శాతం మేర విత్తనాలు విత్తుకున్నారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలతో సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, మినుము, కంది పంటలో కళకళలాడుతుండటంతో రైతులు పంటలను సంరక్షించుకోవడంలో నిమగ్నమయ్యారు. మండలంలో ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 9,838హెక్టార్లు కాగా ఇప్పటిదాకా 1,593హెక్టార్లలో పంటలు సాగుచేశారు. సాగుచేసి నెలరోజులు కావటంతో కంది, మినుము, మొక్కజొన్న, పత్తి పంటలకు రసాయనిక మందులు, పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. మరికొంత మంది రైతులు నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి మొక్కజొన్న, పత్తి విత్తనాలు నాటుకుంటున్నారు. మధ్యకారు పంటలు వేసుకునే రైతులు పొలాల్లో దుక్కిదున్ని విత్తనోత్పత్తికి అనుకూలంగా మార్చుకుంటున్నారు.



మండ్లెంలో మినుము పంటకు రసాయనిక ఎరువులు ఎద్దుల కాడి సాయంతో వేస్తున్న దృశ్యం



తంగడంచ వద్ద మొక్కజొన్న పంటకు బోరు నీటిని మళ్లిస్తున్న కర్షకుడు



మండ్లెం వద్ద కలుపు తీస్తున్న కూలీలు




మొక్కజొన్న పంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో చిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు వైద్యాధికారి తెలిపారు. వ్యాధులకు చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డెంగీ నివారణ చర్యల్లో భాగంగా అమలాపురంగూడెంలో అబేట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. సీహెచ్‌ఓలు రజిత, యశోద, ఆరోగ్య కార్యకర్త మహేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండచిలువను తొక్కేసిన వాహనం



శ్రీశైలం : శ్రీశైలం- దోర్నాల ఘాట్‌లో శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం రోడ్డుకు అడ్డంగా వెళ్తున్న కొండచిలువ పైనుంచి వెళ్లడంతో రోడ్డు పక్కనే మృతి చెందింది. శనివారం ఉదయం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందడంతో చనిపోయిన కొండచిలువను స్వాధీనం చేసుకొని శ్రీశైలం అటవీ ప్రాంతంలో పూడ్చివేశారు. ఆ సమయంలో ఘాట్ రోడ్డులో తిరిగిన వాహనాల వివరాల కోసం ఆయా చెక్ పోస్టుల వద్ద నమోదైన వాహనాల నంబర్లను అధికారులు తనిఖీ చేస్తున్నట్లు తెలిసింది.

మల్లన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



ఏపీ హైకోర్టు న్యాయమూర్తికి స్వాగతం పలుకుతున్న దేవస్థాన ఈఓ, అధికారులు



ఎంపీ న్యాయమూర్తికి రాజగోపురం వద్ద స్వాగతం పలుకుతున్న దేవస్థాన అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి,అమ్మవార్లను మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన వారికి ఆలయ రాజగోపురం వద్ద ఈఓ డి. పెద్దిరాజు, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ సంప్రదాయం ప్రకారంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీస్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో వారికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు వేదాశీర్వచనంతో ఆశీర్వదించారు. ఈఓ స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద వికారాబాద్‌కు చెందిన టి.పి.అనురాధ, బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. కార్యక్రమములో గణపతి ప్రార్థన, భో శంభో, మూషిక వాహన, మహిషాసురమర్ధిని, వినాయక కౌత్వం, భో.. శంభో శివశంభో, జతిస్వరం, అదిగదిగో శ్రీశైలం, నటేశకౌత్వం తదితర గీతాలు, అష్టకాలకు నవ్య, సజన, శర్వాణి, వేద, వైష్ణవి, కావ్య తదితరులు నృత్యం చేశారు.

ప్రకృతి ఒడిలో మహానందీశుడు



నల్లమల అడవిలో పచ్చటి చెట్ల మధ్య మహానంది ఆలయం

కొద్దిరోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలకు నల్లమల చిగురు తొడిగింది. దీంతో నల్లమల గిరులు పచ్చదనంతో అలరారుతున్నాయి. ప్రకృతి అందాల నడుమ మహానంది ఆలయ అందాలు అద్భుతంగా గోచరిస్తున్నాయి. ఈ సుందర దృశ్యాలు భక్తుల మదిని దోచేస్తున్నాయి. క్షేత్రంలో అడుగిడిన భక్తులు ప్రకృతి ఒడిలో ఉన్న ఆలయం, ఆహ్లాదకర వాతావరణానికి మంత్రముగ్ధులవుతున్నారు. – మహానంది